
## రాష్ట్ర అవతరణ దిన వేడుకలకు ఏర్పాట్లు

### అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి

మామిళ్లగూడెం, మే 28 : జిల్లాలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్వో పద్మశ్రీతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకలకు మినిట్ టూ మినిట్ కార్యక్రమ ప్రణాళిక ప్రకారం సిద్ధం చేయాలన్నారు. అన్నిశాఖల జిల్లా అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. వేడుకలకు పరేడ్‌గ్రౌండ్ సిద్ధం చేయాలని తెలిపారు. వానకాలం దృష్ట్యా నగరంలో డ్రైనేజీలు పొంగి పొర్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తులను వెంటనే పరిశీలించాలి

బోనకల్లు, మే 28: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతులు చేసుకున్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. జిల్లాలో భూభారతి రెవెన్యూ సదస్సు పైలెట్ ప్రాజెక్టుగా బోనకల్లు మండలాన్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. మండలంలోని 22 గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల్లో రైతులు సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రమాదేవి, ఆర్ఐలు మైథిలి, నవీన్‌కుమార్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవు

### ఖమ్మంరూరల్ తహసీల్దార్ పీ రాంప్రసాద్


ప్రభుత్వ స్థలానికి హద్దులు ఏర్పాటు చేయిస్తున్న తహసీల్దార్ రాంప్రసాద్

ఖమ్మం రూరల్, మే 28: ప్రభుత్వ భూములపై కన్నేసి అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ మండల తహసీల్దార్ పీ రాంప్రసాద్ హెచ్చరించారు. బుధవారం ఆయన అధికారులతో కలిసి ఏదులాపురం మున్సిపాలిటీలోని ఏదులాపురం సర్వే నెంబర్ 87లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. భూమి చుట్టు కొలతలకు అనుగుణంగా హద్దులు ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొద్ది రోజుల నుంచి మండలంలో ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మంత్రి పొంగులేటి, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములు గుర్తించి వాటికి హద్దులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాలేరులో మేరీ మాత నగర సంకీర్తనం

కూసుమంచి, మే 28: మేరీ మాత బోధనల్లో ప్రేమ, కరుణ, దయ వంటి వాటిని మానవాళికి తెలిసి వారి జీవితాల్లో వెలుగు నింపిన మేరీమాత చూపిన మార్గం ప్రపంచానికి ఆచరణీయమని పాలేరు బాలయేసు పుణ్య క్షేత్రం గురువు ఆంటోనీ అన్నారు. పాలేరులో బుధవారం ప్రసిద్ద మేరీమాత ప్రథమ వార్షికోత్సవం వేడుకల్లో ఆయన మాట్లాడారు. కొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల్లో ఫాదర్ జయరాజు, ఫాదర్ లుకాస్, దైవ సందేశాలు అందజేశారు.


ఊరేగింపులో పాల్గొన్న ఫాదర్ కొమ్ము ఆంటోనీ

**30న వేడుకల్లో పాల్గొననున్న బిషప్**

మేరీ మాత ప్రథమ వార్షికోత్సం ఆంటోని అధ్యక్షతన జరిగే వేడుకల ముగింపు ఈ నెల 30 శుక్రవారం పాలేరులో జరిగే వేడుకల్లో ఖమ్మం మేత్రాసన బిషప్ డాక్టర్ సగిలి ప్రకాశ్ పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని అన్ని మందిరాల నుంచి ఫాదర్‌లు, గురువులు వస్తారని పేర్కొన్నారు.

# మండల కేంద్రాల్లో షీ రాక్స్ సెంటర్లు

### కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రఘునాథపాలెం, మే 28 : జిల్లాలోని దివ్యాంగ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అన్ని మండల కేంద్రాల్లో షీ రాక్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా గార్లపాటి రమాబాయికి మంజూరైన షీ రాక్స్ సెంటర్‌ను బుధవారం రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఉపాధి కల్పించేందుకు షీ రాక్స్ పేరిట ప్రభుత్వ కార్యాలయాల్లో కంప్యూటర్‌తో కూడిన జిరాక్స్ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో సిటిజన్ సర్వీస్‌సెంటర్, స్కానింగ్, నామినేషన్ వంటి సౌకర్యాలను విస్తరిస్తామన్నారు. వీటిని ప్రతి మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, తహసీల్దార్ శ్వేత, ఏపీఎం సుబ్బారావు, సీసీలు జ్యోతి, భిక్షమయ్య, వెంకటేశ్వరరావు, రేణుక, రాజేశ్వరి పాల్గొన్నారు.

**వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్‌కు కార్యాచరణ**

మామిళ్లగూడెం, మే 28 : రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా లాభసాటి వ్యాపార యూనిట్ల గ్రౌండింగ్ జరిగేలా పటిష్ట కార్యచరణ అమలు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం రాజీవ్ యువ వికాసం అమలుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణారావుతో కలిసి హైదరాబాద్ సచివాలయం నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి జూన్ రెండు వరకు ప్రొసిడింగ్స్ తయారు చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గురించి వివరించారు. ఎస్సీ, ఎస్టీ మైనార్టీ, బీసీ వర్గాల వారికి ఎంపికైన లబ్ధిదారులకు శిక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, బీసీ సంక్షేమాధికారి జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్, మైనార్టీ సంక్షేమాధికారి పురంధర్, గిరిజన సంక్షేమాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.


రఘునాథపాలెంలో షీ రాక్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

## నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

బోనకల్లు, మే 28: నకిలీ విత్తనాల పట్ల అప్రత్తంగా ఉండాలని టాస్క్‌ఫోర్స్, వ్యవసాయశాఖ అధికారులు అన్నారు. మండల వ్యవసాయ అధికారి పీ.వినయ్‌కుమార్, బోనకల్లు ఇన్‌స్పెక్టర్ వెంకన్న మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. విత్తన దుకాణాల లైసెన్స్‌లు, విత్తనాల స్టాక్‌ను పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో నాణ్యమైన విత్తనాల ఎంపికలో జాగ్రత్త వహించాలన్నారు. అనుమతి పొందిన అధికారిక డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని, బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని తెలిపారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ విస్తరణ అధికారి గోగులు హరికృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రానైట్ ఫ్యాక్టరీ(టైల్స్) అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

ఖమ్మం రూరల్, మే 28: ఖమ్మం గ్రానైట్ ఫ్యాక్టరీ (టైల్స్) అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం బుధవారం ఖమ్మం నగరంలోని ఖానాపురంలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. ఎన్నికల అధికారి బుగ్గవీటి శ్రీధర్ నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం నూతన అధ్యక్షుడిగా తెడ్డు రమేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ, ప్రస్తుత అధ్యక్షుడు పాటిబండ్ల యుగందర్, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు, పలువురు గ్రానైట్ టైల్స్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఎన్నిక పత్రం స్వీకరిస్తున్న తెడ్డు రమేష్

## హరితం.. హతం

### అధికారుల నిర్లక్ష్యం.. మొక్కలకు శాపం

### ఎండిపోతున్న పెద్దతండా నర్సరీ మొక్కలు

ఖమ్మం రూరల్, మే 28 : అధికారుల నిర్లక్ష్యానికి హరితవానాలు హతమవుతున్నాయి. ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటుకు ముందు మండల కేంద్రంగా ఉన్న పెద్దతండా పంచాయితీలో నర్సరీని గ్రామ పంచాయతీ కార్యాలయ అధికారులు ఏర్పాటు చేశారు. గత ఏడాది మున్నేరుకు భారీ వరద రావడంతో మొక్కలు, నర్సరీ తుడిచిపెట్టుకుపోయింది. దాని స్థానంలో ఈ సంవత్సరం జనవరిలో నాయుడుపేట సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న క్రీడా ప్రాంగణం ఆవరణలో పంచాయతీ అధికారులు నర్సరీని ఏర్పాటు చేశారు. ఇదే స్థలం ప్రక్కనే ప్రభుత్వ స్థలం ఉందని, క్రీడా ప్రాంగణంలో నర్సరీని ఏర్పాటు చేయవద్దని స్థానికుల నుంచి విజ్ఞప్తులు వచ్చినప్పటికీ మొక్కల పెంపకం చేపట్టారు. వేలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన నర్సరీ నిర్వహణకు ఓ చిరుద్యోగిని సైతం నియమించారు. కొద్ది రోజుల పాటు నర్సరీ నిర్వాహణ చేపట్టిన తరువాత నిర్వహణను గాలికి వదిలేశారు.


ఎండిపోయిన మొక్కలతో దర్శనమిస్తున్న పెద్దతండా నర్సరీ

పంచాయతీ మున్సిపాలిటీగా మారిన తరువాత నర్సరీని పట్టించుకోకపోవడంతో మొక్కలు చనిపోయాయి. దీంతో క్రీడా ప్రాంగణంలో పిల్లలు ఆడుకునేందుకు అటంకం ఏర్పడటమే కాకుండా, ఇటు నర్సరీలో మొక్కల పెంపకంపై సైతం నీలినీడలు కమ్ముకున్నాయి. చనిపోయిన మొక్కలను చూస్తున్న ప్రజలు అధికారుల తీరును తీవ్రంగా తప్పుపడుతున్నారు.

# ఆడపిల్ల ఇంటికి మణిదీపం

బోనకల్లు/సత్తుపల్లిటౌన్, మే 28: బోనకల్లు మండల కేంద్రంలోని గిరిజన కాలనీకు చెందిన భూక్యా ఉపేందర్, ప్రియాంక దంపతుల ఆడపిల్లకు జన్మనించిన సందర్భంగా తహసీల్దార్ రమాదేవి, వైద్య అధికారి స్రవంతి వారికి స్వీట్ బాక్స్ ఇచ్చి శాలువాతో సన్మానించారు.

సత్తుపల్లిటౌన్, మే 28: మండల పరిధిలోని కాకర్లపల్లిలో ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను సత్కరించి స్పెషల్ ఆఫీసర్ టీ.సునీల్‌రెడ్డి సర్టిఫికెట్ అందజేశారు.

సత్తుపల్లి, మే 28: కల్లూరు మండలం పేరువంచ సెక్టార్ సూపర్‌వైజర్ భవానీ ఆధ్వర్యంలో కప్పలబంధం గ్రామంలో ఆడపిల్లకు జన్మనిచ్చిన పెనుగొండ వనజ, తిరుపతిరావు దంపతులను ఎంపీడీవో చంద్రశేఖర్ శాలువాతో సన్మానించి స్వీట్‌బాక్స్ అందజేశారు.

రఘునాథపాలెం, మే 28 : ఐసీడీఎస్ ఖమ్మం అర్బన్ ప్రాజెక్టు జింకల తండా సెక్టార్ పరిధిలోని పంగిడి గ్రామంలో బుధవారం మా పాప– ఇంటి మణిదీపం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి డాక్టర్ బి పురంధర్ మాట్లాడుతూ ఆడపిల్లలు ఇంటికి వెలుగని, మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలన్నారు. కవల ఆడప్లిలల తల్లిదండ్రులు బానోత్ రాజేశ్వరి–వినోద్‌కుమార్‌ను సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్‌కే పర్వీన్, గ్రామ కార్యదర్శి సురేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


కవల ఆడపిల్లల తల్లిదండ్రులను సన్మానిస్తున్న ప్రత్యేకాధికారి పురంధర్

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : డీఏవో

తిరుమలాయపాలెం, మే 28: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించిన దుకాణదారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య హెచ్చరించారు. మండలంలోని పిండిప్రోలులో విత్తనాల దుకాణాల్లో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో బిల్‌బుక్కులు, స్టాక్ రిజిస్టర్లు, స్టాక్, ప్రైజ్, నేమ్ బోర్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ ఫామ్ లేకుండ స్టాక్ తెప్పించుకోవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఏవో నారెడ్డి సీతరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

## 'ముగ్గురు మంత్రులున్నా ఫలితం శూన్యం'

మధిర(చింతకాని), మే 28: జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా రైతులకు ప్రయోజనం లేదని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ విమర్శించారు. బుధవారం చింతకాని మండల పరిధిలోని రాయల వీరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన రైతుసంఘం మండల మహాసభలో వారు మాట్లాడారు. అధికారం కోసం రైతులకు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మడుపల్లి గోపాలరావు, రాము, జానకీరాములు, వెంకటనర్సయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

## రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

సత్తుపల్లిటౌన్, మే 28: రైతులు రసాయనిక ఎరువులను వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్ కుమార్ అన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల వారి ఆధ్వర్యంలో మండలంలోని కొత్తూరు రైతువేదికలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. డీన్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ యూరియాను తగిన మోతాదులో వాడడం వల్ల సాగు ఖర్చు తగ్గించుకొని చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు. కొత్తూరు సొసైటీ చైర్మన్ చల్లగుల్ల కృష్ణయ్య, వ్యవసాయ అధికారి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విత్తనాలు, రసాయనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.రాంప్రసాద్, డాక్టర్ ఆర్.రమేష్, పశు సహాయ సంచాలకులు డాక్టర్ ప్రదీప్, పశువైద్యులు డాక్టర్ శశిధర్, వ్యవసాయ విస్తరణ అధికారులు నరేష్, ఆశాజ్యోతి, వాసంతి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

టెలికాలర్స్ కావలెను

★ప్రముఖ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు మంచి వాక్ చాతుర్యం కలిగిన మహిళ టెలికాలర్ కావలెను. జీతం : 10,000/– నుండి 20,000/–వరకు ఇవ్వబడును. సంప్ర: 8297529999
KMM-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి


కొణిజర్ల : ప్రచారం నిర్వహిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

కూసుమంచి, మే 28: అన్ని మౌలిక వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ టీఎస్ యూటీఎఫ్ జీప్ జాతా నిర్వహించారు. కూసుమంచి మండలంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ రవికుమార్‌కు కరపత్రాలను అందజేశారు. కూసుమంచి సెంటర్లో జిల్లా సంఘం బాధ్యులు హెక్ రంజాన్ మాట్లాడారు.

కొణిజర్ల, మే 28: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొణిజర్ల, తనికెళ్ల, పల్లిపాడు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార జాతాను రిటైర్డు ఉపాధ్యాయుడు యాసా సత్యనారాయణ తనికెళ్ల సెంటర్‌లో ప్రారంభించారు.

వైరాటౌన్, మే 28: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రచార జాతా వైరా మండలంలోకి ప్రవేశించింది. ప్రచార జాతాకు వైరా మున్సిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్ సంఘీభావం తెలిపారు. వైరా పాత బస్టాండ్, కొత్త బసాడ్ తదితర ఏరియాల్లో మూడో రోజు ప్రచారం నిర్వహించారు.

పెనుబల్లి, మే 28: ప్రభుత్వ బడులను కాపాడాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాత పెనుబల్లి మండలంలో టేకులపల్లి, పెనుబల్లి, లంకాసాగర్, మండాలపాడు, లంకపల్లి, తదితర గ్రామాల్లో నిర్వహించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## మత రాజకీయాలపై ప్రజలను చైతన్యపరచాలి

### సీపీఐ జాతీయ నేత బాగం హేమంతరావు

ఖమ్మం రూరల్, మే 28 : మత రాజకీయాలపై ప్రజలను చైతన్య పరచాలని, యుద్ధానికి వ్యతిరేకమని కమ్యూనిష్టులు చెబితే పాకిస్తాన్‌కు సపోర్టులుగా చిత్రీకరించి, ట్రంప్ చెబితే యుద్ధాన్ని నిలిపివేన ప్రధాని మోదీ ద్వంద వైఖరీ ప్రదర్శిస్తున్నారని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు విమర్శించారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీలోని వరంగల్ క్రాస్‌రోడ్డు వద్ద మా కాంప్లెక్స్‌లో జరిగిన సీపీఐశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన హక్కుల కోసం పోరాటం చేస్తున్న మావోయిస్టులను ఆపరేషన్ కగార్ పేరుతో హతమార్చడం సరికాదన్నారు. కార్యక్రమంలో మౌలానా, దండి సురేష్, చిన్న వెంకటరెడ్డి, బాస్కర్, రాంకోటి, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నేత బాగం హేమంతరావు

## నేటి నుంచి ఈజీఎస్ సామాజిక తనిఖీ

సత్తుపల్లి, మే 28: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 17వ విడత సామాజిక తనిఖీ గురువారం నుంచి ఈ నెల 30 వరకు కాకర్లపల్లి, రేజర్ల, నారాయణపురం, తుంబూరు, చెరుకుపల్లి, బుగ్గపాడు, సిద్ధారం, రుద్రాక్షపల్లి, రేగళ్లపాడు, బేతుపల్లి, కొత్తూరు, 2వ ఫేజ్‌లో ఈ నెల 31 నుంచి జూన్ 3 వరకు సదాశివునిపాలెం, గంగారం, గౌరీగూడెం, కిష్టాపురం, కిష్టారం, పాకలగూడెం, రామగోవిందాపురం, రామానగరం, తాళ్లమడ, యాతాలకుంటలో జరుగుతున్నట్లు ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామీణ ఉపాధిహామీ కూలీలు, గ్రామస్తులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

## ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

కూసుమంచి, మే 28: తమకు ఇండ్లు లేవని, ఇండ్ల కొసం ప్రజా పాలనలో దరఖాస్తులు పెట్టుకున్నామని, తమకు ఇండ్లు ఇవ్వాలని మండలంలోని గుర్వాయిగూడెం గ్రామానికి చెందిన 15 మంది పేదలు తహసీల్దార్ రవి కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. గుర్వాగూడెం మాజీ సర్పచ్ భిక్షం ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

## 2 నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు

కూసుమంచి, మే 28: జూన్ 2 నుంచి కూసుమంచి మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో భూ భారతి సదస్సులు నిర్వహిస్తున్నట్లు డీటీ కరుణశ్రీ బుధవారం తెలిపారు. 3న మునిగేపల్లి, నాయకన్‌గూడెం, 4న జక్కేపల్లి, జక్కేపల్లి ఎస్సీ కాలనీ, భగత్వీడు, 5న చేగొమ్మ, ఈశ్వరమాధారం, మంగలితండా, 6న ముత్యాలగూడెం, రాజుపేట, రాజుపేట బజార్, 9న జీళ్లచెరువు, కేశ్వాపురం, జుర్జుల్‌రావుపేట, 10న నేలపట్ల, అగ్రహారం, మల్లాయిగూడెం, 11న లోక్యాతండా, పాలేరు, కోక్యాతండా, 12 మల్లేపల్లి, కొత్తూరు, ఎర్రగడ్డ తండా,13 పెరికసింగారం, అజ్మారహీరామాన్‌తండా, చౌపటల్లి, బోడియాతండా, 16 గోరీలపాడుతండా, పోచారం, 17 గట్టుసింగారం, లింగారంతండా, గైగోళ్లపల్లి, 18 కూసుమంచి, ధర్మాతండా, గంగబండతండా, గుర్వాయిగూడెం, లాల్‌సింగ్‌తండా, సంద్యాతండా, 19 నర్సింహులగూడెం, కిష్టాపురం, తురకగూడెం గ్రామసభలు జరుగుతాయని, ప్రజలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## ఛలో వరంగల్‌ను విజయవంతం చేయండి

ఎర్రుపాలెం, మే 28: మంద కృష్ణమాదిగ పద్మశ్రీ అవార్డు స్వీకరించిన సందర్భంగా ఎర్రుపాలెం మండలంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు కూరపాటి మాదిగ, మాదిగ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఊటుకూరి రత్నాకుమార్ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణమాదిగ అవార్డు తీసుకొని ఢిల్లీ నుంచి ఈ నెల 31న వరంగల్ రైల్వేస్టేషన్‌కు విచ్చేస్తున్న సందర్భంగా స్వాగత ర్యాలీ, సభను విజయవంతానికి మండలం నుంచి అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. గట్టిగుండె కిషోర్, అర్కుట్ల బాబురావు, బొక్కా రమేష్, సగ్గుర్తి శ్యామ్, సగ్గుర్తి ముత్యాలరావు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

కారేపల్లి, మే 28: కారేపల్లిలో ఇటీవల వడ్డేంపూడి రఘురాం(నాని) కుటుంబానికి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మేదరి వీరప్రతాప్ (టోనీ) కుటుంబం అండగా నిలిచింది. బుధవారం కారేపల్లిలోని వారి కుటుంబానికి రూ.5వేల నగదును విశ్రాంత ఉద్యోగి మేదరి ఎలిజబెత్ రాణి చేతుల మీదుగా అందజేశారు. అడ్డగోడ ఐలయ్య, తాజుద్దీన్ , కేసగాని రామారావు, తురక రవి, నాగరాజు, శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

వైరాటౌన్, మే 28: వానాకాలం పంటల సాగుకు పచ్చిరొట్ట విత్తనాలు వైరా మండలంలో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏవో మంజుఖాన్ బుధవారం పేర్కొన్నారు. ఈ నెల 30 నుంచి పచ్చిరొట్ట విత్తనాలు(జీలుగు, జనుములు) పంపిణీ చేస్తారని తెలిపారు. విత్తనాల కోసం వచ్చే రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సులు తీసుకొని రావాలని కోరారు.

## మహిళ మిస్సింగ్

వైరాటౌన్, మే 28: వైరాలోని ఓ చర్చికి ప్రార్థన కోసం వచ్చిన మట్టే కళ్యాణి, ఆమె కూతురు రుతిక కనిపించకపోవడంతో ఆమె తండ్రి రాములు వైరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తిరుమలాయపాలెం మండలం జూపెడకు చెందిన కళ్యాణికి కొన్ని రోజులుగా మానసిక స్థితి బాగోలేక మానసిక వైద్యశాలలో చూపించినా తగ్గలేదు. దీంతో తల్లిదండ్రులు బుధవారం వైరాలోని చర్చికి తీసుకొచ్చారు. చర్చిలో ప్రార్థనకి హాజరైన కళ్యాణి సాయంత్రం నాలుగు గంటల సమయంలో తన కూతురితో బయటికి వెళ్లింది. కొద్దిసేపటికి గమనించిన తల్లిదండ్రులు బయటకు వచ్చి చూడగా కనిపించలేదు. వివరాలు తెలిసిన వారు వైరా పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. వైరా ఏసీపీ 8712659146, వైరా సీఐ 8712659147, వైరా ఎస్సై 8712659148 నెంబర్లకు సమాచారం అందించాలని వైరా పోలీసులు కోరారు.

## విత్తన దుకాణాల తనిఖీ

వైరాటౌన్, మే 28: వైరాలో విత్తన దుకాణాలను వైరా మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్ వైరా సబ్ ఇన్స్‌పెక్టర్ పుష్పాల రామారావుతో కలిసి తనిఖీ చేశారు. విత్తన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. స్టాక్ ప్రకారం ధరల పట్టిక, రైతులకు విత్తనాలు అమ్మినప్పుడు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, స్టాక్ మార్చినప్పుడు ఇన్‌వాయిస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే సీడ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.